ఓటరు జాబితా సిద్ధం చేయాలి

కార్యదర్శులకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో రామకృష్ణ

కోరుట్ల రూరల్, ఆగస్టు 23 : మండలంలోని వివిధ గ్రామాల్లో వార్డుల వారిగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని ఎంపీడీవో రామకృష్ణ శుక్రవారం కార్యదర్శులకు సూచించారు. పంచాయతీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో మండల పరిషత్ ఆఫీసులో శుక్రవారం కార్యదర్శులతో సమావేశమయ్యారు. పంచాయతీ ఎన్నికల సన్నద్ధతను వివరించారు. కార్యక్రమంలో ఎంపీవో కృపాకర్, ఆయా గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

డీఎఫ్‌వో రవిప్రసాద్ బాధ్యతల స్వీకరణ

కలెక్టర్‌కు పూల మొక్కను అందిస్తున్న డీఎఫ్‌వో రవిప్రసాద్

జగిత్యాల టౌన్, ఆగస్టు 30: జగిత్యాల జిల్లా అటవీ శాఖ అధికారి మాదాసు రవిప్రసాద్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన కలెక్టర్ బీ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ రాంబాబు, ఎస్పీ అశోక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కలను అందించారు. కార్యక్రమంలో జిల్లా అటవీ క్షేత్ర అధికారులు మెట్‌పల్లి షౌకత్‌అలి, జగిత్యాల పద్మారావు, కొడిమ్యాల గులాం మొయినొద్దీన్, రాయికల్ భూమేశ్, ధర్మపురి శ్రీనాథ్, డిప్యూటీ ఆర్‌వో అరుణ్‌కుమార్, ఆర్వో శ్రీనివాస్, ఎఫ్ఆర్వోలు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం

ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు స్వాగతం పలుకుతున్న అర్చకులు, తదితరులు

కథలాపూర్, ఆగస్టు 23: కథలాపూర్ మండలం ఇప్పపెల్లి గ్రామంలో లక్ష్మీనృసింహా స్వామి కల్యాణోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు ఆలయ అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఉత్సవాలకు హాజరైన భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నాయకులు యాగండ్ల రమేశ్‌గౌడ్, నరేశ్‌చారీ, నరేందర్, కాయితి నాగరాజు, పులి హరిప్రసాద్, కల్లెడ గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను పెంచాలి

మాట్లాడుతున్న కలెక్టర్ సత్యప్రసాద్

- ప్రైవేట్ దవాఖానల్లో మెడికల్ కళాశాల సిబ్బందిని డాక్టర్లుగా నియమించవద్దు
- కలెక్టర్ బీ సత్యప్రసాద్

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: ప్రైవేట్ దవాఖానల్లో సాధారణ ప్రసవాలను పెంచాలని కలెక్టర్ బీ సత్యప్రసాద్ సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం ఆయన ప్రైవేట్ దవాఖానల డాక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ బీ సత్యప్రసాద్ మాట్లాడుతూ, జిల్లాలో 90 శాతం సిజేరియన్ డెలివరీలు చేస్తున్నారని, దానిని తగ్గించాలన్నారు. దవాఖానల్లో తనిఖీల కోసం డాక్టర్లతో బృందం ఏర్పాటు చేస్తామన్నారు. దవాఖాన పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, మెడికల్ కాలేజీ సిబ్బందిని డాక్టర్లుగా పెట్టుకోవద్దని, డాక్టర్లు సెలవులో ఉన్నప్పుడు జూనియర్ డాక్టర్లు దవాఖానలో ట్రీట్‌మెంట్ చేయరాదన్నారు. పేషెంట్ల వద్ద అధిక ఫీజు, అనవసర టెస్టులు చేస్తున్నట్లు ప్రజావాణిలో ఫిర్యాదులు వచ్చినట్లు తెలిపారు. డాక్టర్ ఓపీ రూమ్‌లో విద్యార్హత సర్టిఫికెట్ పెట్టుకోవాలని, ఫైర్, పొల్యూషన్ సర్టిఫికెట్ మాత్రం రిసెప్షన్ దగ్గర ఉంచాలని సూచించారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సమీయొద్దీన్, జిల్లా మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ముసుగు జైపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ప్రైవేట్ దవాఖానల వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

సర్కారు దవాఖానలో మెరుగైన సేవలు

- ప్రజలు వినియోగించుకోవాలి • డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్

కథలాపూర్‌లో జ్వరసర్వే తీరుపై ఆరా తీస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్

కథలాపూర్, ఆగస్టు 23 : ప్రభుత్వ దవాఖానలో మెరుగైన వైద్యసేవలందిస్తున్నామని, ప్రజలు వినియోగించుకోవాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం కథలాపూర్‌లో నిర్వహిస్తున్న జ్వరసర్వే తీరును పరిశీలించారు. పలువురి ఇళ్ల వద్దకు వెళ్లి నీటి నిల్వలను చూశారు. చెత్త కుండీల్లో నీరు నిల్వ ఉంటే దోమల బెడద ఉంటుందని ఉద్బోధించారు. ప్రజలు నీటి నిల్వలు లేకుండా చేసుకోవాలన్నారు. వైరల్ జ్వరం వచ్చినప్పటికి డెంగ్యూ జ్వరం అని అపోహలకు గురికావద్దని, అన్ని రకాల జ్వరాలకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో వైద్య సేవలు అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి సింధూజ, సీహెచ్‌వో సుగుణ, సూపర్‌వైజర్ శ్రీధర్ పాల్గొన్నారు.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

కథలాపూర్, ఆగస్టు 23: కథలాపూర్ మండలం కలికోట పరిధిలోని గిరిజన తండాకు చెందిన ధరావత్ చరణ్(18) శుక్రవారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడని పోలీసులు తెలిపారు. చరణ్ తల్లిదండ్రుల బ్యాంక్ ఖాతాల నుంచి డబ్బులు విత్ డ్రా చేసి వృథాగా ఖర్చు చేస్తున్నాడని ఇటీవలే గుర్తించారు. అనవసరంగా ఎందుకు ఖర్చుచేస్తున్నావని తల్లిదండ్రులు మందలించడంతో మస్తాపం చెందిన చరణ్ గురువారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లారు. శుక్రవారం గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గుర్తించారు. మృతుడి తండ్రి బాబురెడ్డి నాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి ఘన వీడ్కోలు

కొడిమ్యాల, ఆగస్టు 23: మండలంలోని సంద్రాలపల్లి ప్రాథమిక పాఠశాలలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు ఆది రెడ్డి ఉద్యోగోన్నతి పొంది, మరో పాఠశాలకు వెళ్లారు. కాగా, పాఠశాలలో శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఆదిరెడ్డిని శాలువాలతో, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ మంద లింగవ్వ, ఇన్‌చార్జి హెచ్ఎం అశోక్, గ్రామస్తులు పంకాసుల మల్లయ్య, మహేందర్, సీఆర్పీ సాయి లు, అమ్మ ఆదర్శ స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ తైదల స్రవంతి, టీచర్ స్వర్ణ పాల్గొన్నారు.

ఇంటింటా బీసీజీ సర్వే

మేడిపల్లి, ఆగస్టు 23: మేడిపల్లిలో శుక్రవారం వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీసీజీ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ రమ, ఏఎం వో సత్యనారాయణ, సీహెచ్‌వో దీవెన, ఏఎన్ఎం స్వరూప, ఆశ కార్యకర్త మణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం

మేడిపల్లి, ఆగస్టు 23: మండలంలోని కట్లకుంట గ్రామానికి చెందిన అంజిరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ జగిత్యాల దవాఖానలో చేరాడు. డాక్టర్ పరీక్షించి ప్లేట్‌లెట్స్ తగ్గినట్లు తెలుపడంతో, స్పందించిన ఆర్ఎంపీ ఎండీ మజీద్ వెళ్లి రక్తదానం (ప్లేట్‌లెట్స్) చేశాడు. ఎండీ మజీద్‌ను అంజిరెడ్డి కుటుంబస భ్యులు, గ్రామస్తులు అభినందించారు.

హాజరైన అధికారులు, రైతులు, న్యాయవాదులు, విద్యావేత్తలు మాట్లాడుతున్న కలెక్టర్

ఆధార్ తరహాలో భూధార్ కార్డు

- చట్టం రైతులకు చుట్టంలా ఉండాలి • అప్పీలేట్‌కు అవకాశం
- కలెక్టర్ సత్యప్రసాద్ • జగిత్యాలలో ఆర్వోఆర్ చట్టంపై చర్చావేదిక

జగిత్యాల టౌన్, ఆగస్టు 23 : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 20 రకాల చట్టాలు ఉన్న ముసాయిదా నూతన రెవెన్యూ చట్టం 2024పై అభిప్రాయ సేకరణకు చర్చా వేదిక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ బి.సత్యప్రసాద్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఆర్ఓఆర్ చట్టం 2024 అమలుపై న్యాయవాదులు, విద్యావేత్తలు, రైతులు, రైతు సంఘాలు, మేధావులు, విశ్రాంత రెవెన్యూ ఉద్యోగులు, గెజిటెడ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థలతో చర్చావేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మనుషులకు ఆధార్ కార్డ్ ఎలా గో భూములకు భూధార్ కార్డ్ అని అన్నారు. చట్టం అనేది రైతుల చుట్టంలా ఉండాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం ఈ చట్టాన్ని తెలచ్చిందని తెలిపారు. ఈ ప్రభుత్వం ప్రజలు, రైతుల మనోభావాలను, అభిప్రాయాల మేరకు అప్పీలేట్‌కు అవకాశం కల్పించిందన్నారు. ఏ ఒక్క రైతు కూడా నష్టపోకుండా అధికార వికేంద్రీకరణ కాకుండా అధికార కేంద్రీకరణ కోసం ఆర్ఓఆర్ 2024 చట్టాన్ని ప్రభుత్వం తెచ్చినట్లు పేర్కొన్నారు. ఇందులో వ్యవసాయ భూములే కాకుండా వ్యవసాయేతర , ఆబాది భూముల గురించి చాలా మంది రైతులు ఇబ్బందులు పడుతున్నాందున వీటికి అవకాశం క ల్పించనున్నారని పేర్కొన్నారు. చర్చా కార్యక్రమంలో పాల్గొన్న వారి అభిప్రాయాలను ఒక డ్రాఫ్ట్ రూపంలో నివేదికను తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామన్నారు. అనంతరం మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ ఆగస్టు 2 నుంచి 23 వరకు సీసీఎల్ఏ వెబ్‌సైట్‌లో అభ్యంతరాల స్వీకరణకు తమ అభిప్రాయాలను పోస్ట్ ద్వారా గానీ, వెబ్‌సైట్‌లో గాని దరఖాస్తు చే సుకునే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు భూమికి ఒక నంబర్ ఉండాలన్న ఉద్దేశ్యంతో భూదార్ కార్డులు సర్వే చేసిన తర్వాత భూమి యజమానులకు మా త్రమే మంజూరు చేస్తామన్నారు. భూదార్‌లో తాత్కాలిక, శాశ్వత భూదార్ గురించి, హక్కుల రికార్డు, నమోదు చేయు అధికారి, ఆబాది, వ్యవసాయేతర భూములకు సంబంధించిన రికార్డుల గురించి వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కొత్త చట్టంలో అప్పీలేట్ అధికారులను నియమించనున్నట్లు తెలిపారు. తహసీల్దార్, ఆర్డీవోల మ్యూటేషన్లపై అభ్యంతరాలను స్వీకరించే అవకాశం ఉందన్నారు. కా ర్యక్రమంలో అదనపు కలెక్టర్ రాంబాబు, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి ఆర్డీవో లు మ ధుసూదన్, ఆనంద్‌కుమార్, శ్రీనివా స్, రె వెన్యూ ట్రిసా అధ్యక్షులు వకీల్, జిల్లా టీ ఎన్జీ వో అధ్యక్షుడు బోగ శశిధర్, న్యాయవాదులు, విద్యావేత్తలు, రైతులు, రైతు సంఘాలు, మే ధావులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, గెజిటె డ్, నాన్ గెజిటెడ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన గృహ ప్రవేశానికి మాజీ మంత్రి కొప్పుల హాజరు

మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను ఆహ్వానిస్తున్న వెంకటేశ్

వెల్గటూర్, ఆగస్టు 23: కిషన్‌రావుపేటలో బీఆర్ఎస్ బీసీ సెల్ మండలాధ్యక్షుడు కుమ్మరి వెంకటేశ్ నూతన గృహ ప్ర వేశం చేయగా, మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ హా జరయ్యారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చల్లూరి రాంచందర్‌గౌడ్, ఆలయ కమిటీ చైర్మన్ నైనాల అజయ్, ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్, మాజీ సర్పంచ్ మేర్గు కొమురయ్య, ఎస్సీ సెల్ మండలాధ్యక్షుడు కొప్పుల సురేశ్, మాజీ ఎంపీటీసీ మూగల సత్యం, నాయకులు బాలసాని రవి, సత్యం, కొత్త హరీశ్, అల్లుగూరి సతీశ్, తరల్ల తిరుపతి, ఎట్టం నర్సయ్య, ఎట్టం తిరుపతి ఉన్నారు.

వికటించిన టీకా

సౌదీలో జగిత్యాల జిల్లా వాసి యువకుడి నరకయాతన

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: హైదరాబాద్‌లోని ఒక గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో టీకా వేయించుకొని సౌదీకి వెళ్లిన ఓ యువకుడు టీకా వికటించి అస్వస్థతకు గురై నరకయాతన అనుభవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్‌లోని గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలతోపాటు టీకా వేయించుకున్నాడు. ఢిల్లీలోని హెచ్ఆర్ ఇంటర్నేషనల్ అనే రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా జాబ్ వీసాపై జూలై 11న సౌదీ అరేబియాలోని ఆల్-బాద్ తాబూక్‌కు వెళ్లాడు. అక్కడ ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల తర్వాత టీకా తీసుకున్న కుడి భుజానికి ఇన్ఫెక్షన్ అయింది. మెరుగైన చికిత్స కోసం స్వదేశానికి పంపించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని చంద్రశేఖర్ తల్లి ఆవేదన వ్యక్త చేసింది. తిరిగి స్వదేశానికి అత్యవసరంగా రప్పించడానికి చర్యలు తీసుకోవాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ పీవోఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది.

రాజన్న ఆలయంలో కొనసాగిన ఏసీబీ తనిఖీలు

వేములవాడ, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న సన్నిధిలో ఏసీబీ అధికారుల తనిఖీలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. గురువారం 20 మంది ఏసీబీ అధికారుల బృందం 12 గంటల పాటు తనిఖీ చేయడంతోపాటు రికార్డు చేయగా, రెండోరోజు పది మంది అధికారులు స్వామివారికి సంబంధించిన లీజులు, పలు విభాగాల టెండర్లు, నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన పలు రికార్డులను 4 గంటలపాటు పరిశీలించారు. లడ్డూ ప్రసాదాల తయారీ, విక్రయాలు, గోదాం నిల్వలు, లీజుల టెండర్లు, వసతి గదుల సముదాయాలు, నిత్యాన్నదానం తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసినట్టు తెలిసింది.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఇ-టెండరు కోరుతూ ప్రకటన
(http://ireps.gov.in ద్వారా)

దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.01 **NIT No: C/E.29/TRD/SC/23/2024-25, పని పేరు:** టెండరు నం. C/E.29/TRD/ SC/ 23/ 2024-25, తేది: 20-08-2024. SC డివిజన్: PDPL-NZB: పెద్దపల్లి జంక్షన్-లింగంపేట జగిత్యాల సెక్షన్‌పై యాంటి మంకీ క్లైంబింగ్ డివైస్ ఏర్పాటుచేయుట. **అంచనా వ్యయం: రూ. 26,13,712/-, పూర్తి చేయు కాలం:** 90 రోజులు, **ముగింపు తేది:** 16-09-2024న, 15.00 గం.

1) బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ http:// ireps.gov.in కు లాగిన్ కాగలరు.
2) టెండరుదారుల ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మ్యాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) టెండరు ఫారం ధర & బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కాగోరు టెండరు దారులందరు కోరబడుచున్నారు.
4) GSTIN ఐడెంటిఫికేషన్ నెం.లు పొందవల్సిందిగా మరియు తమ ఆఫర్లతో పాటు దాఖలు చేయవల్సిందిగా కాగోరు టెండరు దారులందరు కోరబడుచున్నారు.
5) టెండరు దాఖలుచేయు కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారు ఏదేని సవరణల (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీ చెయ్యబడును) కొరకు గమనించగలరు.

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ / TRD/సికింద్రాబాద్
A1061

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘట న వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవా రం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

రాజంపేట్, ఆగస్టు 23: పొలంలో విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం అన్నారం తండాలో శుక్రవారం చోటుచేసుకున్నది. తండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి(33) తనకున్న రెండెకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన తిరుపతికి.. పక్కనున్న పొలానికి కరెంట్ సరఫరా కోసం తీసుకున్న వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వేతనాల కోసం అంగన్‌వాడీల ధర్నా

కామారెడ్డి, ఆగస్టు 23: వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మినీ అంగన్‌వాడీ నిర్వాహకులు శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు.

'తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవు'

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవని, స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చే అధికారం తల్లికి ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుశీల్ అగర్వాల్ అనే మహిళకు భర్త నుంచి సంక్రమించిన ఇంటిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచకుండా పెద్దకుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడాన్ని సివిల్ కోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలన్న వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఆ ఆస్తి యజమానిగా తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు చెప్పింది.

ఆ అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- సివిల్ సూట్ల విచారణపై హైకోర్టు స్పష్టీకరణ
- పెండింగ్ సూట్లను కలెక్టర్లకు అప్పగించాలని తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏజెన్సీ చట్ట నిబంధనల ప్రకారం సివిల్ సూట్లపై విచారణ జరిపే అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్నదని, ఆ అధికారాన్ని ప్రభుత్వ అదనపు ఏజెంట్లుగా పీవోలకు కట్టబెట్టడం చెల్లదని స్పష్టం చేసింది. 2002లో ఉట్నూరు ఐటీడీఏ పీవోకు సివిల్ సూట్లను విచారించే అధికారాన్ని అప్పగిస్తూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఐటీడీఏ పీవోల వద్ద పెండింగ్‌లో ఉన్న అన్ని సివిల్ సూట్లను కలెక్టర్లకు బదిలీ చేయాలని ఆదేశించింది. ఒక సివిల్ వివాదంలో డాక్యుమెంట్లను పరిశీలించేందుకు చేతిరాత నిపుణులకు పంపాలన్న అభ్యర్థనను తిరస్కరిస్తూ ఉట్నూరు ఐటీడీఏ పీవో ఉత్తర్వులు జారీచేయడంపై హస్సాపూర్ గ్రామానికి చెందిన చవన్ ప్రకాశ్ హైకోర్టును ఆశ్రయించడంతో జస్టిస్ కే శరత్ శుక్రవారం ఈ తీర్పును వెలువరించారు.

అన్నలు నా బిడ్డ జీవితాన్ని నాశనం చేశారు

- ఏడేండ్లు సేవ చేయించుకొని హతమార్చారు
- భోరున విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు

ఇంటిముందు విలపిస్తున్న రాధ తల్లిదండ్రులు పోచమ్మ, బాలయ్య

కాప్రా, ఆగస్టు 23: 'అమ్మా, నాకు ఉద్యోగం దొరకబోతోంది, త్వరలోనే మన కష్టాలు తీరుతాయి' అందరూ జాగ్రత్తగా ఉండండి అంటూ ఇంటి నుంచి వెళ్లిన పల్లెపాటి రాధ అటు నుంచి అటే అదృశ్యమై పోయిందనీ, ఏడేండ్ల తర్వాత విగతజీవిగా తిరిగి వచ్చిందని మావోయిస్టు రాధ అలియాస్ నీల్సో తల్లిదండ్రులు పల్లెపాటి పోచమ్మ, పల్లెపాటి బాలయ్య భోరున విలపిస్తున్నారు. ఉమ్మడి నల్గొండ జిల్లా తుర్కపల్లి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన పల్లెపాటి బాలయ్య జీవనోపాధి కోసం కుటుంబంతో 35 ఏండ్ల క్రితం కాప్రాలోని ఇందిరానగర్‌కు వచ్చాడు. ఆయనకు భార్య, ఇద్దరు కొడుకులు, ఇద్దరు కుమార్తెలు. చిన్న కుమార్తె రాధ అలియాస్ నీల్సో డిప్లొమా ఇన్ మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ (డీఎంఎల్‌టీ)కోర్సు పూర్తి చేసింది. మహిళలను చైతన్యం చేసేందుకు, వరకట్న దురాచారాలను, మద్యం వంటి చెడు అలవాట్లనుంచి కుటుంబాలను దూరం చేసేందుకు ఆమె స్వచ్ఛంద సంస్థలో చేరింది. చక్కటి గొంతు, తెలివితేటలు, సమాజాన్ని చైతన్య పరిచాలనే దృక్పథం నచ్చి ఆమెను స్వచ్ఛంద సంస్థ వారు చేర్చుకున్నారు. ఆ సంస్థవారే తమ బిడ్డను ఉద్యమం బాట పట్టిస్తారని ఊహించలేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. 2017లో 17 ఏండ్ల వయస్సులో రాధ తమను విడిచి వెళ్లిందని, ఎంత వెతికినా దొరకలేదని చెప్పారు. ఆమె మావోయిస్టుల దళంలో చేరినట్టు మూడేండ్ల క్రితం తెలిసిందని అన్నారు. ఈ నెల 19న ఆమె మృతి చెందిందని, భద్రాచలం వద్ద మృతదేహం ఉన్నట్టు సమాచారం వచ్చిందని తెలిపారు. రాధను ఇన్‌ఫార్మర్ నెపంతో మావోయిస్టులే చంపారని చెప్పారు. ఆమె ఉద్యమానికి ద్రోహం తలపెట్టే వ్యక్తి అయితే ఏడేండ్లు ఎలా పనిచేస్తుందని ప్రశ్నించారు. దళితురాలు అయినందునే కోవర్టు ఆరోపణతో హతమార్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎంతోమంది ఎన్నో ఏండ్లు నక్సల్స్‌గా పనిచేసి ఏదో ఒక దశలో లొ